క్లుప్తంగా

అప్పన్నను దర్శించుకున్న దేవదాయశాఖ కమిషనర్



కమిషనర్ సత్యనారాయణకు అప్పన్న జ్ఞాపికను అందజేస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం, జ్ఞాపికలను దేవస్థానం ఈవో వి.త్రినాథరావు అందజేశారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు.

ఘనంగా తిరునక్షత్రం పూజలు ప్రారంభం



స్వామివారి ఉత్సవమూర్తులు

సింహాచలం : సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం నుంచి మనవాళ్ల మహామునులు తిరునక్షత్రం పూజలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఆలయ ఆస్థానమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి, ఆళ్వారులను వేంజేంపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, షోడషోపచారపూజలు నిర్వహించారు. దివ్యప్రబంధ పారాయణాలు పఠించారు. విశేషంగా హారతులు అందజేశారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు, పారాయణదారులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 6వ తేదీతో తిరునక్షత్రం పూజలు ముగుస్తాయి.

'తాడి' ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ: కాలుష్య కోరల్లో చిక్కుకొని అల్లాడుతున్న తాడి, మూలస్వయంభువరం గ్రామాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించి ఆదుకోవాలని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబుకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు విజ్ఞప్తి చేశారు. పరవాడ సినిమాహాలు కూడలిలో శనివారం రోడ్డు మరమ్మతులకు శంకుస్థాపన చేయడానికి విచ్చేసిన సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఫార్మాసిటీ పరిశ్రమలు విడుదల చేస్తున్న కాలుష్యంతో తాడి గ్రామస్తులు ఏళ్ల తరబడి నరకయాతన పడుతున్నారని గుర్తు చేశారు. సింహాద్రి ఎన్టీపీసీ విడుదల చేస్తున్న కాలుష్యంతో కలపాక శివారు మూలస్వయంభువరం గ్రామ ప్రజలు 28 ఏళ్ల నుంచి అవస్థలు పడుతున్నారని వివరించారు.

వీఆర్ఏల ధర్నా రేపు

సబ్బవరం: తమ సమస్యలను సత్వరం పరిష్కరించాలని మండలంలోని వీఆర్ఏలు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. ఈమేరకు తహసీల్దార్ చిన్నికృష్ణకు వినతిపత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేస్తామని తహసీల్దార్‌కు నోటీసు అందజేసినట్టు వీఆర్ఏల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధరరావు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నైట్ వాచ్‌మెన్, ఇసుక డ్యూటీల నుంచి వీఆర్ఏలకు మినహాయించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న విధంగా పే స్కేల్ వర్తింపజేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న వివిధ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని వీఆర్ఏలు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
9885181097

ధర దడ

కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో కూరగాయలు కొనాలంటేనే సామాన్యులు ఆలోచించే పరిస్థితి ఏర్పడింది. గతంలో బజారుకు రూ.200 తీసుకువెళ్తే సంచి నిండా కూరగాయలు వచ్చేవి.. ఇప్పుడు చేతినిండా డబ్బులు తీసుకెళ్లినా సంచి సగానికి కూడా కూరగాయలు రావట్లేదంటూ వాపోతున్నారు. -పరవాడ

- చుక్కల్లో కూరగాయల ధరలు
- నియంత్రించలేని ప్రభుత్వం
- విలవిల్లాడుతున్న సామాన్యులు



ఈ ఏడాది కురిసిన అధిక వర్షాల కారణంగా మార్కెట్‌లో కాయగూరలు ధరలు ఆకాశాన్నంటాయి. భారీ వర్షాలతో కూరగాయల సాగుకు తీవ్ర నష్టం వాటిల్లడమే కాకుండా రవాణాకు అంతరాయం కలగడంతో కూరగాయల ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని వ్యాపారులు చెబుతున్నారు. రోజంతా కష్టపడి సంపాదించిన సొమ్మంతా కూరగాయల కొనుగోలుకే చాలడం లేదని కష్ట జీవులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజంత కూలిపని చేస్తే తప్పా పూట గడవని కష్ట జీవులకు ఈ ధరల మోత మరింత భారంగా మారింది. కూటమి ప్రభుత్వం ధరల నియంత్రణలో చేతులెత్తేయడంతో సామాన్యులు విలవిల్లాడుతున్నారు. ప్రస్తుతం చిక్కుడు, బీర, ఉల్లి, టమాటా, పచ్చిమిర్చి, అల్లం ధరలు అమాంతం పెరగడంతో గ్రామీణ ప్రజలు కొనలేక ఇబ్బందులు పడుతున్నారు. కార్తీక మాసం ప్రారంభం కావడంతో కూరగాయల ధరలు మరింత రెక్కలొచ్చాయి. ప్రస్తుతం మార్కెట్లో చిక్కుడు కిలో రూ.100, కాకర, బీర కిలో రూ.80, పచ్చిమిర్చి రూ.70, వంగ, బెండ కిలో రూ.60, టమాటా, దొండకాయలు కిలో రూ.50, బంగాళదుంపలు కిలో రూ.40లకు లభ్యమవుతున్నాయి.

మార్కెట్‌లో కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి


	కిలో రూ.లలో		కిలో రూ.లలో		కిలో రూ.లలో
చిక్కుడు	100	ఉల్లిపాయలు	60	వంకాయలు	60
బీరకాయలు	80	క్యాబేజీ	60	బెండకాయలు	60
కాకరకాయలు	80	టమాటా	50	బరబాటి	60
పచ్చిమిర్చి	70	దొండకాయలు	50	అల్లం	80
		ఉల్లిపాయలు	60	బంగాళదుంపలు	40



పరవాడ వారపు సంతలో కూరగాయలను కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



టమాటా నిల్వలు



ఉల్లిపాయల నిల్వలు

కొనలేకపోతున్నాం



ప్రస్తుతం కూరగాయల ధరలు పెరుగుదల చూస్తుంటే భయమేస్తోంది. ఎన్నడూలేని విధంగా ఖూరగాయల ధరలు ఆకాశాన్ని అంటడడంతో అధిక ధరలకు కొనలేని పరిస్థితి. రోజంతా కష్టపడగా వచ్చిన కష్టార్జితాన్ని కూరగాయలకే వెచ్చించాల్సి వస్తోంది. పెరిగిన ధరలు తగ్గుముఖం పట్టే సూచనలు కనిపించడం లేదు.

-కన్నూరు అచ్చియ్యమ్మ, నాయుడుపాలెం

వర్షాలు పడితే ధరల మోతే



వర్షాలు పడితే చాలు వ్యాపారులు కూరగాయల ధరలను అమాంతంగా పెంచేస్తున్నారు. మాలాంటి సామాన్యులం కూరగాయలు కొనాలంటే కష్టంగా ఉంది. ఈ మధ్యకాలంలో టమాటా, బీర, ఉల్లి ధరలు గణనీయంగా పెరగడంతో కొనుగోలు చేయడానికి ఇబ్బందులు పడ్డాం. కూరగాయల ధరలను అదుపుచేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

-పైల ఎర్రయ్యమ్మ, వెన్నలపాలెం

వర్షాలకు పంట నష్టం



ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పంటలకు నష్టం వాటిల్లగా.. చేతికందికొచ్చిన పంట రవాణా చేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో మార్కెట్లకు తగినంత సరకు రాకపోవడంతో కూరగాయల ధరలు పెరిగాయి. ప్రజల అవసరాలకు తగ్గట్టుగా ఉత్పత్తులు, సరఫరాను పెంచడానికి చర్యలు తీసుకొంటే ధరలు కొంత మేర తగ్గే అవకాశాలుంటాయి. -డి.వెంకటరమణ, వ్యాపారి, అనకాపల్లి

సింహగిరికి కార్తీక శోభ



సింహగిరిపై కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో పరమేశ్వరుడికి అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు



రావి,మర్రిచెట్టుల వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

సింహాచలం : కార్తీకమాస శోభతో శనివారం సింహగిరిపై శివాలయాలు కళకళలాడాయి. ఆయా శివాలయాల్లో కార్తీకమాసం పూజలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి, సింహగిరిపై కొలువుదీరిన కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్వామికి పెద్ద ఎత్తున అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాల్లో ఉన్న ధ్వజస్తంభాలు, నాగేంద్రుడు, రావి, మర్రిచెట్ల వద్ద పెద్ద ఎత్తున దీపారాధన చేశారు. సాయంత్రం జరిగిన ఆకాశ దీపోత్సవాల కార్యక్రమంలో పాల్గొని తరించారు. త్రిపురాంతకస్వామి అర్చకుడు రమణమూర్తి, కాశీవిశ్వేశ్వరస్వామి అర్చకుడు శ్రావణ్ ఈపూజలను నిర్వహించారు. పాత అడవివరం, కుమ్మరిదిబ్బ, విజినిగిరిపాలెం శివాలయాల్లోను, 93వవార్డు పరిధి ప్రహ్లాదపురంలోని శివాలయంలో శనివారం తెల్లవారుజాము నుంచి పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి పరమేశ్వరుడిని దర్శించుకున్నారు. 98వ వార్డు పరిధి సింహపురికాలనీలో ఉన్న ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం పూజలను వైభవంగా ప్రారంభించారు. తెల్లవారుజామున శ్రీ సిద్ధి వినాయకస్వామికి విశేషంగా అభిషేకం నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి 10.30గంటల వరకు పరమేశ్వరుడికి అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 6.30గంటల నుంచి నిర్వహించిన ఆకాశదిపోత్సవంలో పాల్గొని తరించారు.



పూజలందుకున్న రమా సత్యనారాయణస్వామి

సత్యనారాయణస్వామికి ఘనంగా పూజలు

పెందుర్తి: సాధూమఠం వద్ద ఉన్న రమా సత్యనారాయణస్వామి దేవాలయంలో కార్తిక మాస ప్రారంభోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేకాలంకరణ చేసి అర్చనలు జరిపారు. కుంభ హారతి, నక్షత్ర హారతి, బిల్వ హారతి, నంది హారతులు ఇచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు బి.మురళిశర్మ, ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత

పరవాడ: విద్యార్థులు విలువలతో కూడిన విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఉక్కునగరం పవర్ గ్రిడ్ సంస్థ చీఫ్ మేనేజర్ పి.రాజు అన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను పురస్కరించుకొని పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు దేశ శ్రేయస్సు కోసం సంస్కృతి సమగ్రత అనే అంశంపై శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కె.మహాలక్ష్మి, ఎస్.పి.ప్రజ్ఞ, వి.రాజు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఎం.ఉషారాణి, భూపేంద్రపాల్‌లకు ప్రోత్సాహక బహుమతులు లభించాయి. విద్యార్థులకు చీఫ్ మేనేజర్ పి.రాజు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు లలితకుమారి, లక్ష్మీకాంతం, పవర్‌గ్రిడ్ మేనేజర్ అమరదీప్, పైలా అప్పారావులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రాజు

రాష్ట్రస్థాయి ఆర్చరీ, వుషు పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు



రాష్ట్ర స్థాయి వుషు పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పరవాడ: మండలంలో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఆర్చరీ, వుషు పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి చెప్పారు. గత నెల అరకులో జరిగిన స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్చరీ పోటీల్లో ప్రతిభ కనబర్చిన సంస్కృతి గ్లోబల్ పాఠశాలకు చెందిన వి.ఆద్య, పి.అరియానా, ఎ.చారుహాసిని, కె.సాయిమనస్వి, బి.వైష్ణవి, పూర్వ్ రాథోడ్, ఎస్.తేజేశ్వరరావు, పి.సాహిత్ కృష్ణంరాజు, వి.సాకెత్‌రామ్ రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యారని. వీరు త్వరలో పార్వతీపురంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి చెప్పారు. అదే విధంగా పాఠశాలకు చెందిన బి.విక్టర్, రాహుల్ మిస్త్రీ, అభినవ్, సంజయ్, సీహెచ్.సహజ్, క్రిష్ దేవని శ్రీకాకుళంలో జరగనున్న రాష్ట్ర స్థాయి వుషు పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం శనివారం అభినందించింది. కార్యక్రమంలో పాఠశాల సీఈవో కె.నిశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమమే ధ్యేయం

సబ్బవరం: పాడిరైతుల సంక్షేమం,ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ పేర్కొన్నారు. మొగలిపురంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత పశు గర్భకోశ వ్యాధుల చికిత్స, పాడి రైతుల అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనారోగ్యానికి గురైన పశువులకు తక్షణం చికిత్స చేయించాలన్నారు. పశుపోషణపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో 52 పశువులకు గర్భకోశ చికిత్సలు చేసి శాంపిల్స్‌ను సేకరించారు. 32 పెయ్యిలకు నట్టల నివారణ మందులు వేసినట్టు గుల్లేపల్లి పశువైద్య అధికారి సంధ్య తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశు గణాభివృద్ధి అధికారి డాక్టర్ బి.ప్రసాదరావు, ఉప సంచాలకులు డాక్టర్ ఎం.చంద్రశేఖర్, సబ్బవరం ప్రాంతీయ పశు వైద్య కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ కె.ఉషాకుమారి, డాక్టర్ పి.భానుబాబు, ఎంపీటీసీ బంగారినాయుడు, నానాజీ, డాక్టర్ ఎస్ సౌజన్య, ఎస్ స్వర్ణలత, జి.అరుణ తదితరులు పాల్గొన్నారు.



పాడి రైతులకు మందులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ తదితరులు

సూర్యనారాయణమూర్తి సేవలు ప్రశంసనీయం


సబ్బవరం: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన ఎంఈవో-2 బోలెం సూర్యనారాయణమూర్తి సేవలు ప్రశంసనీయమని ఎంపీపీ బోకం సూర్యకుమారి పేర్కొన్నారు. శనివారం సూర్యనారాయణ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సబ్బవరం మండలంలో 2023 నుంచి 2024 వరకు ఎంఈవో-2గా విధులు నిర్వహించి పలువురు మన్ననలను పొందారన్నారు. 2011వ సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో, 2014లో జిల్లా స్థాయిలోను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారన్నారు. సూర్యనారాయణమూర్తిని ఎంపీపీతో పాటు పలువురు ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ గాదెల శ్రీనివాసులునాయుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, బోను గంగునాయుడుతో పలువురు ఎంఈవోలు, ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిదులు పాల్గొన్నారు.



బోలెం సూర్యనారాయణమూర్తిని సత్కరిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి తదితరులు

విద్యార్థులకు అభినందన

సబ్బవరం: ఇటీవల మధురవాడలో ఫ్యూచర్ ఆన్-24 జోనల్ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో సబ్బవరం విద్యార్థులు ప్రతిభ చాటుకున్నారు. సైన్స్, ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ, సోషల్, సైన్స్, క్రాఫ్ట్ విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. విద్యార్థులు అశోక్, విశ్వనాథ్, శివ హేమంత్, నవదీప్, మున్నాలను శనివారం గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణ అభినందించారు. విద్యార్థులను అభినందించిన వారిలో డీసీవో ఎస్.రూపావతి, వైస్ ప్రిన్సిపాల్ సత్యారావు, గైడ్ టీచర్‌లు డాక్టర్ టి.రాంబాబు, డి. నానాజీ, ఉపాధ్యాయులు మోహన్‌రావు, జానకి రామ్, సింహాచలం, చిరంజీవిరావు, ప్రభాకరరావు, తిరుపతిరావు తదితరులు ఉన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు

పెందుర్తిలో చెలరేగిన దొంగలు

- చినముషిడివాడ, సప్తగిరినగర్ సాయిబాబా ఆలయాల్లో హుండీల చోరీ
- పాపయ్యరాజుపాలెం ఓ ఇంట్లో 8 తులాల బంగారు ఆభరణాల అపహరణ



శారదాపీఠం సమీపంలో, సప్తగిరినగర్ సాయిబాబా ఆలయాల్లో చోరీకి గురైన హుండీలు



దుండగులు విడిచిపెట్టిన రూ.10 నాణేలు

పెందుర్తి: నగర శివారు పెందుర్తి పట్టణంలో మరోసారి దొంగలు హల్‌చల్ చేశారు. ఒకే రాత్రి ఏకంగా మూడు చోట్ల చోరీలకు పాల్పడి అలజడి రేపారు. చినముషిడివాడ, సప్తగిరినగర్‌లలో సాయిబాబా ఆలయాల్లో హుండీలను ఎత్తుకుపోగా..పాపయ్యరాజుపాలెం బీసీ కాలనీలో ఓ ఇంటిని కొల్లగొట్టి 8 తులాల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. ఆలయాల ప్రతినిధులు, ఇంటి యజమాని, పోలీసుల కథనం ప్రకారం వివరాలివి..పాపయ్యరాజుపాలెంలో నివాసం ఉంటున్న బలివాడ శ్రీనివాసరావు శుక్రవారం రాత్రి అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న సొదరి ఇంటికి కుటుంబ సమేతంగా వెళ్లారు. రాత్రికి అక్కడే ఉండిపోయారు. అదను చూసిన దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలోని 8 తులాల బంగారు ఆభరణాలతో పాటు 50 తులాల వెండి సామగ్రిని చోరీ చేశారు. ఉదయం ఇంటికి వచ్చిన శ్రీనివాసరావు తలుపులు తీసి ఉండడంతో ఆందోళన చెంది పరిశీలించగా బంగారం ఆభరణాలు, వెండి వస్తువులు పోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆలయాల్లో..

చినముషిడివాడ శారదాపీఠం సమీపంలోని సాయిబాబా దేవాలయంలోకి శుక్రవారం రాత్రి దుండగులు చొరబడి హుండీని ఎత్తుకుపోయారు. ఆయా హుండీలో దాదాపు రూ.15 నుంచి రూ 20 వేలు ఉండవచ్చని ఆలయ ప్రతినిధులు చెబుతున్నారు. సప్తగిరినగర్ సమీపంలోని సాయిబాబా ఆలయంలో దుండగులు చొరబడి హుండీని అపహరించుకుపోయారు. ఆయా ఆలయాల్లో ఎత్తుకుపోయిన హుండీల్లోని నగదును తీసుకుని సమీపంలోని తుప్పల్లో పడేశారు. చోరీకి గురైన ప్రాంతాల్లో క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. పై కేసులను పెందుర్తి క్రైం విభాగం ఎస్ఐ సూరిబాబు ఆధ్వర్యంలో కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

మూడు నెలల వ్యవధిలో పెందుర్తి ప్రాంతంలో రికార్డు స్థాయిలో దాదాపు 15కు పైగా చోరీలు జరిగాయి. రెండు నెలల క్రితం పెందుర్తిలో ఏటీఎం, దొగ్గవానిపాలెం సమీపంలో వరుసగా మూడు ఇళ్లల్లో చోరీలు, మరో రెండు ఇళ్లల్లో చోరీలు చోటుచేసుకున్నాయి. నాలుగైదు చైన్ స్నాచింగ్‌లు కూడా జరిగాయి. అయితే గతంతో పోల్చితే పెందుర్తి ప్రాంతంలో క్రైం విభాగం ఉన్నతాధికారుల పర్యవేక్షణ పూర్తిగా శూన్యంగా కనిపిస్తోంది. గతంలో కేవలం పెందుర్తి సర్కిల్ విభానికే ఇన్‌స్పెక్టర్‌ను నియమించేవారు. అయితే కొన్నాళ్ల క్రితం పెందుర్తి, గోపాలపట్నం, ఎయిర్‌పోర్టు, కంచరపాలెం సర్కిళ్లను కలిపి వెస్ట్ జోన్‌గా ఏర్పాటు చేసి ఒక్కరినే ఇన్‌స్పెక్టర్‌గా కొనసాగిస్తున్నారు. దీంతో చోరీలు అధికంగా జరిగే అవకాశం ఉన్న శివారు పెందుర్తి ప్రాంతంపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ చాలావరకు కొరవడింది. ఫలితంగా ఇటీవల కాలంలో నేరాలు పెరిగాయని స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం



సర్పంచ్ శ్రీనివాసరావుతో కలిసి అర్జీలను స్వీకరిస్తున్న డీటీ గణేష్

సబ్బవరం: భూ సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ గణేష్ కోరారు. మండలంలోని బోదువలస గ్రామంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. రీ సర్వేలో వచ్చిన ప్రతి అర్జీపై సమగ్రంగా విచారణ జరిపి పరిష్కరిస్తామన్నారు. మొత్తం 126 అర్జీలు స్వీకరించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నేబర్తి శ్రీనివాసరావు, సర్వేయర్ లాలం అప్పారావు, మాజీ సర్పంచ్‌లు కోన సంజీవరావు, బుదిరెడ్ల రామకృష్ణ, గంతకోరు సూర్యనారాయణ, కొట్యాడ కృష్ణమూర్తి, వెలుగు సర్వేయర్ రాము తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపు కేసులో రౌడీషీటర్ అరెస్ట్



రౌడీషీటర్ దేవంద్రకుమార్

పెందుర్తి: మద్యానికి డబ్బులు ఇవ్వలేదన్న కారణంతో అర్ధరాత్రి ఇంటికి వెళ్లి చంపుతానని బెదిరించిన ఓ రౌడీషీటర్‌ను పెందుర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లిలో హేమంత్, లలిత దంపతులు నివాసం ఉంటున్నారు. అదే ప్రాంతానికి సమీపంలోని శేషాద్రినగర్‌లో కొప్పల దేవేంద్రకుమార్ అలియాస్ దేవ(రౌడీషీటర్) నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి 11.30 సమయంలో హేమంత్‌కు ఫోన్ చేసిన దేవేంద్రకుమార్ మద్యానికి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీనికి హేమంత్ నిరాకరించడంతో నేరుగా ఇంటికి వెళ్లి హేమంత్, భార్య లలితను చంపుతానని బెదిరించినట్లు పెందుర్తి పోలీసులకు లలిత ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పెందుర్తి పోలీసులు రౌడీషీటర్ దేవను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. నిందితుడికి కోర్టు రిమాండ్ విధించింది.

మొగలిపురంలో శ్రమదానం

సబ్బవరం: మండలంలోని మొగలిపురంలోని శ్మశానవాటిక, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పరిసర ప్రాంతాలలో సచివాలయ ఉద్యోగులు, గ్రామ ప్రజల సహకారంతో శనివారం శ్రమదానం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్ట్ ఎరువుల తయారీలో భాగంగా వానపాములను విడిచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కిరణ్, సర్పంచ్ గండి అరుణ, ఎంపీటీసీ బంగారినాయుడు, వార్డు మెంబర్ అంగటి నానాజీతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

పెందుర్తి: వేర్వేరు ప్రాంతాల్లో రెండు ద్విచక్ర వాహనాలను దొంగలించిన వ్యక్తిని పెందుర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. క్రైం విభాగం ఎస్ఐ డి.సూరిబాబు తెలిపిన వివరాల ప్రకారం..పెందుర్తి పెద్దినాయుడు కాలనీకి చెందిన హేమలత ఈ ఏడాది జూన్ 10 ఇంటికి సమీపంలో స్కూటీని పార్కింగ్ చేసింది. అయితే మరుసటి రోజు చూసేసరికి స్కూటీ లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. సుజాతనగర్‌కు చెందిన కుప్పిలి పాత్రో తన పల్సర్ బైక్‌ను గత నెల 4న ఇంటి వద్ద పార్కింగ్ చేశాడు. ఉదయం చూసేసరికి బైక్ మాయమైంది. ఆయా ఫిర్యాదుల మేరకు వెస్ట్ జోన్ సీఐ ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టిన ఎస్.డి.సూరిబాబు, హెచ్‌సీలు జి.నాగరాజు, ఎం.ఎస్ నాయుడు, పీసీలు టి.శివప్రసాద్, బి.దేముడు నిందితుడి కోసం గాలించారు. ఈ క్రమంలో ఆయా ద్విచక్ర వాహనాలను అమ్మడానికి ప్రయత్నిస్తున్న అంపోలు కిషోర్ నాయుడు అలియాస్ ధోనా బాయ్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com